# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **'స్వచ్ఛ భారత్ మిషన్'కు 10 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా 'స్వచ్ఛ భారత్ దివస్-2024' కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు పాల్గొంటారు.**

2. **గాంధీ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మచిలీపట్నంలో ఈ రోజు నిర్వహించే స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో పాల్గొంటారు.**

3. **ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రేషన్ కార్డు దారులకు రాయితీపై కందిపప్పు, చక్కెర పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.**

4. **తెలంగాణలో రైతు బంధు కింద 18వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమచేశామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు**

5. **ఈరోజు మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి దేశ ప్రజలు ఘనంగా నివాళులర్పిస్తున్నారు.**

==========================

'స్వచ్ఛ భారత్ మిషన్' ప్రారంభమై 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, గాంధీజీ 155వ జయంతి సందర్భంగా నిర్వహించే 'స్వచ్ఛ భారత్ దివస్-2024' కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు పాల్గొంటారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించే ఈ కార్యక్రమంలో 9 వేల 6 వందల కోట్ల రూపాయలతో చేపట్టనున్న పారిశుధ్య-పరిశుభ్రత సంబంధిత పలు పథకాలకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. అలాగే "అమృత్ 2.0" కింద పట్టణ నీటి సరఫరా, మురుగు నీరు శుద్ధి వ్యవస్థల అభివృద్ధికి 6 వేల 8 వందల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. 'క్లీన్ గంగ జాతీయ మిషన్' కింద గంగానది పరీవాహక ప్రాంతాల్లో జల నాణ్యత మెరుగుదల-వ్యర్థాల నిర్వహణ, 'గోబర్'ధన్ పథకం కింద 13 వందల 32 కోట్ల రూపాయిలతో నిర్మించే 15 కంప్రెస్డ్ బయోగ్యాస్ -సిబిజి కేంద్రాల నిర్మాణానికి ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు.

---------------------------

గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మచిలీపట్నంలో ఈ రోజు నిర్వహించే స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం పాల్గొంటారని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి నిన్న సాయంత్రం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆంధ్ర జాతీయ కళాశాలకి గాంధీజీకి ప్రత్యేక అనుబంధం ఉందని తెలిపారు. మచిలీపట్నం నగరపాలక సంస్థ దేశంలోనే అతి పురాతనమైనదని, నగరాన్ని

ఆదర్శ నగరంగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలుపుతూ,

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న రేషన్ కార్డు దారులకు రాయితీపై కందిపప్పు, చక్కెర పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో రాయితీపై లబ్ధిదారులకు కందిపప్పు, చక్కెర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మార్కెట్లో నిత్యవసర సరుకుల ధరలు అధికంగా ఉన్నాయన్నారు. ఈ నెల నుండి ఒక్కొక్క కార్డు దారునికి 67 రూపాయలకే కిలో కందిపప్పు, 17 రూపాయలకే అరకేజీ చక్కెర పంపిణీ చేయడం జరుగుతుందని తెలియజేశారు. జనవరి నుండి రేషన్ కార్డుల ద్వారా రాగి, చిరుధాన్యాలు కూడా అందించనున్నామని మంత్రి తెలుపుతూ

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

తెలంగాణలో రైతు బంధు కింద మూడు విడతల్లో 18వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమచేశామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, పంటరుణాలు తీసుకున్న 42లక్షల మంది రైతుల వివరాలను బ్యాంకర్లు ఇచ్చారని, వారికి 31వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉందని చెప్పారు.

---------------------------

ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రహదారులు, భవనాల మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లా బనగానపల్లి మండలం నందవరం గ్రామంలో మంత్రి ఫించన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి. పింఛన్‌ను 4 వేల రూపాయలకు పెంచామని, భూ హక్కు చట్టాన్ని రద్దు చేశామని తెలిపారు.

---------------------------

సత్యాగ్రహం, అహింసా అనే పదునైన ఆయుధాలతో దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించిన మహనీయులు మహాత్మా గాంధీ జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం. దీనిపై మా ఆకాశవాణి ప్రతినిధి అందిస్తున్న మరిన్ని వివరాలను ఇప్పుడు విందాం.

..వాయిస్..

---------------------------

హైదరాబాద్ నగరాభివృద్ధి కోసమే మూసీ నది పరివాహక ప్రాంత అక్రమణల తొలగింపు చేపట్టామని తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు తెలిపారు. నిన్న హైదరాబాద్ లో మంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా చేస్తామన్నారు. మూసీ నిర్వాసితులకు మరో చోట ఆవాసం కల్పించడంతోపాటు, ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. దీంతో మూసీ పరిధిలో చాలా మంది

స్వచ్ఛందంగా ఇళ్లు ఖాళీ చేస్తున్నారని మంత్రి తెలియజేశారు.

---------------------------

దేశ వ్యాప్తంగా వరద ప్రభావిత ప్రాంతాలకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 5 వేల 858.60 కోట్ల రూపాయల నిధులను విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ సహాయంలో భాగంగా జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధుల కింద 14 రాష్ట్రాలకు ఈ మేరకు హోంశాఖ నిధులు మంజూరు చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన కేంద్ర బృందాలు.. నష్టాన్ని అంచనా వేస్తూ ఇచ్చిన నివేదిక మేరకు తక్షణసాయంగా ఈ నిధులను కేటాయించింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు ఒక వెయ్యి 36 కోట్లు, తెలంగాణకు 416.80 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. కేంద్ర బృందాల నుంచి పూర్తిస్థాయి నివేదిక వచ్చిన తర్వాత మరిన్ని నిధులు మంజూరు చేయనున్నట్లు హోంశాఖ పేర్కొంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం తొలి వంద రోజుల పాలన పూర్తి చేసుకుంది. ఈ వంద రోజుల్లో వికసిత్ భారత్ దిశగా మోదీ 3.0 పాలన సాగింది. కాగా ఎన్డీఏ ప్రభుత్వం వంద రోజుల పాలనపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

======================